



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం, జనవరి 14, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్



జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాడి చేశారనే ఆరోపణలతో అదుపులోకి..

హైదరాబాద్‌లో ఓ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చి బయటికి వస్తుండగా అరెస్టు

కరీంనగర్‌కు తరలించిన పోలీసులు.. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ శ్రేణులు

## కిషన్‌రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు.. హాజరైన ప్రధాని

న్యూఢిల్లీ:కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాసంలో సోమవారం (జనవరి13) సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రధాని తొలుత తులసి చెట్టుకు పూజ చేశారు. అనంతరం గంగిరెద్దులకు అరటిపళ్ళు తినిపించి,నూతన వస్త్రాలు బహుకరించారు. భోగి రోజు కావడంతో

(మిగతా 2వ పేజీలో)



# పెట్టుబడంటే తెలంగాణే

అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలి

పెట్టుబడులకు గమ్యస్థానంగా రాష్ట్రానికి పేరు.. దావోస్‌లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి

పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి.. నిరుటి దావోస్ ఒప్పందాల కార్యరూపంపై సంతృప్తి



హైదరాబాద్, జనవరి 13 : "పెట్టుబడులంటేనే తెలంగాణ అనేలా ఉండాలి. అందుకు తగ్గట్లుగా మన ప్రణాళికలను రూపొందించాలి. పెట్టుబడులకు గమ్యస్థానంగా ఇప్పటికే దేశంలో అందరి దృష్టిని తెలంగాణ ఆకర్షిస్తోంది. విదేశీ కంపెనీలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉంది. దావోస్ పర్యటన సందర్భంగా.. ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ)లో మరిన్ని కంపెనీలను ఆకర్షించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 20 నుంచి దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫకు ఆయన వెళ్లనున్నారు. అంతకంటే ముందు సింగపూర్‌లో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో.. గత ఏడాది దావోసలో జరిగిన డబ్ల్యూఈఎఫ్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాటి పురోగతిపై సోమవారం తన నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర అధికారులతో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ఏడాది దావోస్ ఒప్పందాల మేరకు ప్రాజెక్టులు ఏయే దశల్లో ఉన్నాయి? ఎన్ని ప్రారంభమయ్యాయి? అనే వివరాలను సీఎం రేవంత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా

(మిగతా 2వ పేజీలో)




# ఎలాగైనా వెళ్లాల్సిందే

గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

ఆదివారం కూడా భారీగా తరలిన జనం

పండుగకు ఇప్పటికే 30 లక్షల మందికి పైగా సొంతూళ్లకు..!

హైదరాబాద్ : సంక్రాంతి పండుగ వేళ...ప్రయాణాలు సాగుతూనే ఉన్నాయి. ఆదివారం కూడా మహానగరం పల్లెబాట పట్టింది. వారం రోజులుగా సుమారు 30 లక్షల మందికి పైగా నగరవాసులు సొంత ఊళ్లకు వెళ్లినట్టు అంచనా. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోయాయి. సొంత వాహనాల్లోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. సుమారు 8 లక్షల మందికి పైగా రైళ్లలో తరలివెళ్లినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఏపీ వైపు వెళ్లే బస్సులను కూకట్‌పల్లి, మియాపూర్, అమీర్‌పేట, లక్డీకాఫల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ మీదుగా నడిపారు. వరంగల్ వైపు వెళ్లే బస్సులను ఉప్పల్‌కే పరిమితం చేశారు.కొన్నింటిని సాగర్‌రోడ్డు, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ వరకు పరిమితం చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో కలిపి 12 లక్షల మందికి పైగా వెళ్లారు.

### హైవేలన్నీ వాహనాలతో నిండుగా..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం కూడా రద్దీ కొన సాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద తెల్లవారుజాము నుంచి రాత్రి 7 గంటల వరకు 65 వేల వాహనాలు వెళ్లాయి. నల్లగొండ జిల్లాలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు 30 వేల వాహనాలు

(మిగతా 2వ పేజీలో)



## మిత్రులకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు




# కరెంటు చార్జీల పెంపు లేదు

**ఇటీవల సీఎం, డిప్యూటీ సీఎం నిర్వహించిన సమీక్షలో నిర్ణయం**

**ప్రస్తుత చార్జీలే 2025-26 లోనూ కొనసాగించాలని ఆదేశం**

**వారంలో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు**

**రూ.57,448 కోట్లకు చేరిన డిస్కంల మొత్తం నష్టాలు**

**డిస్కంలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టీకరణ**

**వచ్చే ఏడాదిలో చార్జీలు పెంచాలన్న విద్యుత్ సంస్థల విజ్ఞప్తికి నో**

హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. చార్జీలు పెంచాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. ప్రస్తుత విద్యుత్ చార్జీలనే వచ్చే ఆర్థిక సంవత్సరం 2025–26లో యథా తథంగా కొనసాగించాలని స్పష్టం చేసింది. విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించకుండానే 2025–26కి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి సమర్పించేందుకు డిస్కంలకు అనుమతి నిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యుత్ చార్జీలనే 2025–26లోనూ కొనసాగించాలని ప్రతిపాదిస్తూ వారం రోజుల్లో ఈఆర్సీకి ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పిస్తామని డిస్కంల అధికారవర్గాలు వెల్లడించాయి.

**నష్టాల ఊబిలో డిస్కంలు..**

ఉత్తర/దక్షిణ డిస్కంలు గత ఆర్థిక సంవత్సరం 2023%–%24లో రూ.6,299.29 కోట్ల కొత్త నష్టాలను మూటగట్టుకోగా, మొత్తం నష్టాలు రూ.57,448 కోట్లకు ఎగబాకాయి. ఒక్క టీజీఎస్పీడీసీఎల్ నష్టాలే రూ.39,692 కోట్లకు చేరగా, టీజీఎన్పీడీసీఎల్ రూ.17,756 కోట్ల నష్టాల్లో ఉంది. కాగా విద్యుత్ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి గత శనివారం ఆ శాఖపై నిర్వహించిన సమీక్షలో.. డిస్కంల నష్టాలను అధికారులు ప్రస్తావించారు. విద్యుత్ చార్జీల పెంపు అనివార్యంగా మారిందని వివరించారు. గృహాలు మినహాయించి కేవలం పారిశ్రామిక, ఇతర వాణిజ్య కేటగిరీల విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతించాలని కోరినట్టు తెలిసింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపు జోలికి వెళ్లవద్దని సీఎం, డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత చార్జీలనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొనసాగిస్తామని ప్రతిపాదిస్తూ ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాలని సీఎం ఆదేశించారని అధికార వర్గాలు తెలిపాయి. వచ్చే



శనివారం ఈఆర్సీకి ఈ మేరకు ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించే అవకాశముందని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

**విద్యుత్ సబ్సిడీ పెంచక తప్పదు**

ప్రస్తుత విద్యుత్ చార్జీలతోనే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సర ఫరా చేస్తే డిస్కంలకు కొత్తగా వచ్చే నష్టాలను డిస్కంలు అంచనా వేసి ఈఆర్సీకి సమర్పించే ప్రతిపాదనల్లో ఆర్థిక లోటుగా చూపించనున్నాయి. ఈఆర్సీ పరిశీలించి ఆమోదించిన నష్టాల మొత్తాన్ని డిస్కంలకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తేనే విద్యుత్ చార్జీల పెంపు భారం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. గతేడాది నవంబర్ నుంచి ప్రస్తుత ఏడాది మార్చి 31 వరకు రాష్ట్రంలో రూ.1,200 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ డిస్కంలు గతేడాది చివర్లో ప్రతిపాదనలు సమర్పించగా, ఈఆర్సీ అనుమతించకపోవడంతో చార్జీల పెంపు భారం నుంచి ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలను రూ.11,499 కోట్లకు పెంచేందుకు అంగీకరించడంతో ఇది సాధ్యమైంది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ సబ్సిడీలను ప్రభుత్వం మరింతగా పెంచితేనే ప్రజలపై చార్జీల పెంపు భారం ఉండదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

# గేమ్ చేంజర్ ఆన్‌లైన్‌లో పెడతామంటూ బ్లాక్‌మెయిల్

## అడిగినంత డబ్బు ఇవ్వాలని డిమాండ్

## విడుదల రోజే సోషల్ మీడియాలో లీక్

## సైబర్ క్రైమ్‌లో చిత్ర యునిట్ ఫిర్యాదు




రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ చేంజర్ సినిమాను లీక్ చేసి ఆన్‌లైన్ పెడతామని కొందరు బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ చిత్ర యూనిట్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. సినిమా విడుదలకు వారం రోజుల ముందు నుంచే కొంతమంది దుండగులు సినిమా నిర్మాతతో పాటు చిత్ర యూనిట్‌లోని ప్రముఖులకు ఫోన్‌లు చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారని ఫిర్యాదు చేశారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతూ భారీగా డబ్బులు డిమాండ్ చేశారు. రిలీజ్‌కు రెండు రోజుల ముందు సినిమాలోని కీలక సన్నివేశాలను లీక్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సినిమా రిలీజ్ అయిన రోజే హెచ్‌డీ ప్రింట్‌ను లీక్ చేసి సోషల్ మీడియాలో పెట్టినట్లు తెలిపారు. 45 మంది వ్యక్తులు ఒక ముఠాగా ఏర్పడి, గేమ్ చేంజర్ సినిమాను పథకం ప్రకారమే లీక్ చేసి, ఇబ్బందులు సృష్టించి బ్లాక్‌మెయిల్ చేశారని చిత్ర యూనిట్ గుర్తించింది. ఈ ముఠా వెనుక ఎవరో బలమైన వ్యక్తి ఉండి ఇదంతా నడిపిస్తున్నట్లు అనుమానించిన చిత్ర బృందం హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



# కేంద్ర జలసంఘం అధ్యక్షుడిగా ముఖేశ్ కుమార్ సిన్హా

## ::: ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

హైదరాబాద్, జనవరి 13 : కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అధ్యక్షుడిగా ముఖేశ్ కుమార్ సిన్హాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర క్యాబినెట్ నియామక కమిటీ ఆయన పేరును సిఫారసు చేయగా, ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముఖేశ్‌కుమార్ హైదరాబాద్‌లోని గోదావరి యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా పనిచేస్తున్నారు.




**4 రోజుల్లో రూ.24.69 లక్షల కోట్ల**

# ఇన్వెస్టర్ల సంపద హుష్‌కాకి..!




దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజులుగా 'బేర్'మంటున్నాయి. నాలుగు సెషన్లలో ఇన్వెస్టర్లు రూ.24.69 లక్షల కోట్ల సంపద కోల్పోయారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, నిరంతరం విదేశీ నిధుల ఉపసంహరణతోపాటు ఉద్యోగాల కల్పన మెరుగుదలతో యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గింపు అవకాశాలు సన్నగిల్లాయి. మరోవైపు, ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ గత రెండేండ్లలో తొలిసారి జీవిత కాల కనిష్టానికి పతనమైంది. ఫలితంగా ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలహీన పడింది. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ గత శుక్రవారం.. 1048.90 పాయింట్ల నష్టంతో 76,330.01 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.24,69,243.3కోట్లు కోల్పోయి రూ.4,17,05,906.74 కోట్ల వద్ద నిలిచింది. అంతే కాదు శుక్రవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.82 లక్షల కోట్ల డాలర్ల దిగువకు పతనమైంది. సోమవారం ఇన్వెస్టర్లు రూ.12.61 లక్షల కోట్లు కోల్పోయారు. సెగెటివ్ సెంటిమెంట్ నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈ నెలలో రూ.20 వేల కోట్ల విలువ గల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. రష్యా ముడి చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ 1.43 శాతం పుంజుకుని 80.90 డాలర్ల వద్ద ట్రేడయింది. బీఎస్ఈలో 3562 షేర్లు నష్టపోగా, 555 స్టాక్స్ లాభ పడ్డాయి. మరో 131 స్టాక్స్ యథాతథంగా కొనసాగాయి.

# పెట్టుబడంటే తెలంగాణే

సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తోందన్నారు. "ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులు తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయి. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గత ఏడాది దావోస్ డబ్ల్యూఈఎఫ్‌లో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి" అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికారులు సీఎంకు ఆయా ప్రాజెక్టుల పురోగతిపై వివరణ ఇచ్చారు. 14 ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు వచ్చాయని తెలిపారు. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని, వీటిలో 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఏడు ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉన్నాయని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబుతో ఆయా కంపెనీల వారీగా పురోగతిని సీఎం చర్చించారు.

**విదేశాల్లో సుడిగాలి పర్యటనలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.

# తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, జనవరి 13 : 'రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, భోగిమంటలు, పిండివంటల సమ్మేళనమే సరదాల సంక్రాంతి పండగ. ఈ సందర్భంగా భారతీయులందరికీ, ముఖ్యం తెలుగువారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 'పండుగ కోసం నగరాలన్నీ పల్లెలవైపు పరుగులు తీశాయి. ప్రజలకు ఈ పండుగపై ఉన్న మక్కువను ఇది తెలియజేస్తుంది. పల్లె సౌభాగ్యమే దేశ సౌభాగ్యం. ఆనందాలు, సిరి సంపదలతో పల్లెలు సుభిక్షంగా శోభిల్లాలి. తెలుగువారు ఎక్కడున్న ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'నని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కిషన్‌రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు.. హాజరైన ప్రధాని

భోగి మంట వేశారు. ఈ సంబరాలకు ప్రధాని మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,పలువురు కేంద్రమంత్రులు,బీజేపీ ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు హాజరయ్యారు. అంతకుముందు సినీ నటుడు చిరంజీవి,ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ నాగేశ్వరరావు,బ్యాడ్మింటన్ క్రీడాకారిని పీవీ సింధుతో కలిసి సంక్రాంతి వేడుకలకు ప్రధాని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ గాయని సునీత గీతాలాపనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు.

# త్రివేణి సంగమం భక్తజన సంద్రం

ఉండవచ్చు. ఈ నిర్మాణాల కోసం, ఇతరత్రా సౌకర్యాల కల్పన కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.7వేల కోట్లు ఖర్చుచేసింది. భక్తులపై ఇంత వ్యయం చేస్తున్న సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి...వారివల్ల కనిష్ఠంగా రూ. రెండు లక్షల కోట్ల మేర ఆర్థిక వృద్ధి సమకూరనున్నదని అంచనా. 40 కోట్లమంది భక్తులు సగటున ఐదు వేలు చొప్పున ఖర్చుచేస్తే సమకూరే ఆర్థిక ప్రయోజనం ఇదీ. అదనంగా ఆహార పదార్థాలు, పానీయాల విక్రయాలద్వారా మరో రూ.20 వేల కోట్ల ఆదాయం ఖజానాకు చేరుతుందని అఖిల భారత వర్తక సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేసింది. యూపీ కనీసమాత్ర, వాస్తవ జీడీపీలో ఒక శాతం పెరుగుదలకు ఈ వృద్ధి దోహదపడుతుంది. దీనిపై యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ.. 2019లో జరిపిన అర్ధ కుంభమేళాలో 24 కోట్లమంది భక్తులు పాల్గొనగా, రాష్ట్ర ఖజానాకు రూ. 1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. ఇలా చూస్తే.. ఈసారి రూ. రెండు లక్షల కోట్లు తేలిగ్గా సమకూరతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**విదేశీ భక్తుల హడావుడి**

దాదాపు 13 అఖాడాలకు చెందిన వేలాది మంది సాధుసంతులు మహాకుంభమేళాలో పాలుపంచుకుంటున్నారు. విదేశాల నుంచి కూడా భక్తులు తరలివస్తున్నారు. పవిత్ర స్నానాలు ఆచరించడానికి త్రివేణి సంగమ తీరానికి అతి భారీ ఎత్తున చేరుకుంటున్న భక్తులు.. స్నానఘట్టాల వద్ద జరిగిన ఏర్పాట్ల పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంగమ తీరంలోని నందీద్వారం వద్ద నెలకొల్పిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల కటౌట్ల వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

**'విగ్రహం' చుట్టూ వివాదం..**

మహా కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయం సింగ్ యాదవ్ విగ్రహం ఏర్పాటు వివాదానికి దారితీస్తోంది. విగ్రహం ఉన్నచోట శిబిరం ఏర్పాటుచేసి సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు ఆహారం, వసతిని భక్తులకు కల్పిస్తున్నారు. అయితే, తన పాలనాకాలంలో హిందూ, సనాతన వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన ములాయం విగ్రహం ఇక్కడ పెట్టడం ఏమిటంటూ కొందరు భక్తులు, హిందూ సంస్థల ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిములకు అనుకూలంగా, ఆయోధ్య ఆలయ ఉద్యమానికి వ్యతిరేకంగా నాడు ములాయం నిలిచారని అఖిల భారతీయ అఖాడా పరిషత్ మహంత్ రవీంద్ర పూరీ తెలిపారు. కోట్లాదిమంది హిందూ భక్తులు భక్తిశ్రద్ధలతో స్నానాలు ఆచరించే స్థలంలో అలాంటి నేత విగ్రహం పెట్టడం సరైన చర్య కాదన్నారు. రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన ములాయం పట్ల తమకు రాజకీయంగా ఏ వ్యతిరేకతా లేదన్నారు.




# ఎలాగైనా వెళ్లాల్సిందే

వెళ్లాయి. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు టోల్‌ప్లాజా నుంచి సాధారణ రోజుల్లో 30వేల వరకు వాహనాలు రాకపోకలు సాగించగా, ఆదివారం 70 వేలకు పైగా వాహనాలు వెళ్లాయి. ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు మల్టిజోన్–2 ఐజీ సత్యనారాయణ తెలిపారు.





# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి13 : చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగారెడ్డి గూడెం ఒకటో వార్డులో భోగి పండుగ పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడో వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగింది. న్యాయ నిర్నేతలుగా డాక్టర్ ఉబ్బు నరసింహ, సిలువేరు శ్రీనివాస్,బోయ రాములు రావడం జరిగింది. వీరి ఆధ్వర్యంలో ముగ్గులను పరిశీలించి విజేతలుగా నిర్ణయించడం జరిగింది, మొదటి బహుమతి కాశి పోగు భ్యూలా,రెండో బహుమతి బోదుల మౌనిక, మూడో బహుమతి తూర్పునూరి సంతోష,విజేతలుగా గెలుపొందారు.ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి బహుమతి ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమానికి హాజరైన న్యాయ నిర్నేతలను అంబేద్కర్ యువజన సంఘం సభ్యులందరూ ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డు కౌన్సిలర్ కొరగోని లింగస్వామి, బోదుల నర్సింహా, ఆరుట్ల యాదయ్య,బోదుల లింగస్వామి, బోదుల రామచంద్ర, ఆరుట్ల లింగస్వామి, అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు..



# సంస్థాన్ నారాయణపురం
# క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఆడటం వల్లనే నాలోని క్రీడ ప్రతిభ బయటకి వచ్చింది

## క్రికెట్ సౌత్ జోన్ చెన్నైకి సెలెక్ట్ అయిన- కొర్ర సాయిరాం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్‌సాగర్) : సంస్థాన్ నారాయణపురం క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో ఆడడం వల్లనే నాలో క్రీడా ప్రతిభ గుర్తించారని అన్నారు కొర్ర సాయిరాం, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు నిర్వహించడం వల్లనే గ్రామీణ ప్రాంత యువతలో క్రీడల ప్రతిభ వెలికితీయడం జరుగుతుందని అన్నారు, క్రికెట్ సౌత్ జోన్ చెన్నైకి సెలెక్ట్ అయిన సందర్భంగా నాకు సన్మానం చేసిన, ముద్దంగుల నరసింహ గారికి ఉప్పల లింగస్వామి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు, మీరు నిర్వహించిన క్రీడలతో నాకీ అవకాశం వచ్చిందని తెలిపారు, కొర్ర సాయిరాం, మీరు 4 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న క్రీడలను మీరు ఇలాగే కొనసాగిస్తూ, మన గ్రామీణ ప్రాంత యువత లోని క్రీడా ప్రతిభని వెలికి తీయాలని అన్నారు, ఎస్ ఎన్ పి ఎల్ స్పాన్సర్లు ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు, క్రీడాకారుని సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, నారాయణపూర్ మాజీ జెడ్పిటిసి తిరుమల భాను వెంకటేష్ గౌడ్, నోముల మాధవరెడ్డి, దూలూరి జైపాల్ రెడ్డి, మిమ్మల్ని నర్సిరెడ్డి, వీళ్ళ లింగస్వామి గౌడ్, వివేకానంద యువకేంద్ర అధ్యక్షులు రాపర్తి



వెంకటేష్ గౌడ్, సురపల్లి వెంకటేష్, క్రీడల ఆర్గనైజర్ హెూండా నవీన్ గౌడ్, తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు



# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

సంస్థాన్ నారాయణపూర్ జనవరి 13 :( వార్త మిర్రర్) : నారాయణపూర్ మండల కేంద్రంలోని మహ్మదాబాద్ గ్రామంలో నిరుపేద కుటుంబ సభ్యులైన ఉప్పరి ఊశయ కుటుంబానికి, రాపర్తి పరమేష్ అండాలు దంపతులు 25 కిలోల బియ్యం వంట సామాగ్రి అందించడం జరిగింది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నల్లబోతు సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది .

## గద్దర్ గళం ఫౌండేషన్ రాయికల్ నూతన కమిటీ ఏర్పాటు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి (తిరుమల శంకర్) జనవరి 13 : గద్దర్ గళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజాయుద్ధనౌక గద్దర్ కాంస్య విగ్రహ ఏర్పాటు జనవరి చివరి వారంలో చేయటానికి నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ప్రతి జిల్లా మండల కేంద్రంలో కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. గద్దర్ గళం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గజ్జల స్వామి, జగిత్యాల జిల్లా కన్వీనర్ ఈదుల లక్ష్మణ్ కుమార్ కో కన్వీనర్ అంతడుపుల అంజయ్య రాయికల్ మండల కన్వీనర్ గా నలువాల రాముని కో కన్వీనర్ గా కురిసెంగ ప్రసన్న కుమార్ ని నియమించడం జరిగింది. కవులు కళాకారులు ఉద్యమకారులు ప్రజా నాయకులు రాజకీయ నాయకులు అందరు కూడా అత్యధిక సంఖ్యలో ఈ యొక్క విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేయడంలో భాగస్వాములం కావాలని కోరారు. తదనంతరం నాలువల రాము, కురి సెంగ ప్రసన్నకుమార్ లు మాట్లాడుతూ గద్దర్ తో కొన్ని వేదికలు పంచుకోవడం జరిగింది. గద్దర్ అన్న పదములో వంత పాడుతూ అడుగులో అడుగు వేస్తూ కొన్ని కార్యక్రమాలు చేయడం నా పూర్వజన్మ సుకృతం అని కొనియాడుతూ, గద్దర్ అన్న విగ్రహ ఏర్పాటు కోసం మేము బాధ్యతలో ఉండటం మాకు గొప్ప వరం, ఈ అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతలు అన్నారు.

# ఘనంగా శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవం

## కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే బాలు నాయక్





దేవరకొండ జనవరి 13 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలో సోమవారం నా డు భోగి పండుగ సందర్భంగా పట్టణంలోని గరుడాద్రి నగర్ సంతోషి మాత రోడ్డు ప్రక్కన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సందర్శించి,శ్రీ గోదా రంగనాథ స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో కలిసి వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్.అనంతరం ఎమ్మెల్యే ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తాను ప్రత్యేక శ్రద్ధ చూపుతానని హామీ ఇచ్చారు.దేవాలయ ప్రాంగణం పునరుద్ధరణకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు, ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం, ఆలయంతోపాటు ప్రాంతీయ అభివృద్ధి కార్యకలాపాలను ముందుకు తీసుకువెళ్లాలని తన సంకల్పాన్ని ప్రకటించారు.ఆలయానికి కావాల్సిన నిధులు రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి తో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ని కలిసి నిధులు మంజూరు చేయించి ఆలయ నిర్మాణం పూర్తి చేసి రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు రేవంత్ రెడ్డి చేతుల మీద ప్రారంభోత్సవం చేసుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ %ఠ% దేవాలయ ఛైర్మెన్ ఆలంపల్లి నర్సింహా,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల వెంకటయ్య గౌడ్,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి దొడ్డి అశోక్, కోశాధికారి శిరంధాస్ కృష్ణయ్య,ఉపాధ్యక్షులు దొడ్డి వేంకటేశ్వర్లు,మాజీ ఎంపీపీలు జాని యాదవ్,గోవింద్ యాదవ్,మాజీ జడ్పీటీసి దేవేందర్ రావు,మండల పార్టీ అధ్యక్షులు బాధ్య నాయక్, కౌన్సిలర్లు వడ్త్యా దేవేందర్ నాయక్, భూదేవి సైదులు,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,పానగంటి మల్లయ్య,ఇమ్మడి భద్రయ్య, కర్నాటి పురుషోత్తం, దొడ్డి సుధాకర్,నక్క వెంకటేష్,శ్రవణ్ కుమార్,యువ నాయకులు బాబు రామ్ నాయక్,పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సెల్ టవర్ల నుండి ఆర్ఆర్‌యు పరికరాలు చోరీ చేసిన దొంగ అరెస్టు

మిర్యాలగూడ జనవరి 13:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్ పై వస్తున్న హిస్టరీ షీట్ ధీరావత్ నవీన్ ధీరావత్ తండా నుండి వస్తు పోలీసులను చూసి తడబడుతూ పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నామని రూరల్ సీఐ కె. వీరబాబు సోమవారం తెలిపారు. తీసుకుని విచారించగా గత ఏడాది జూన్ నెలలో శ్రీనివాస్ నగర్ గ్రామంలో ఎయిర్ టెల్ టవర్ నుండి బ్యాటరీ, జూలై నెలలో నందిపాడులోని ఎయిర్ టెల్ఆ టవర్ నుండి రేడియో రిమోట్ యూనిట్ పరికరాలను దొంగిలించి హైదరాబాద్లో అమ్ముకునేందుకు వెళ్తూ పట్టుబడ్డాడని ఆయన తెలిపారు. సుమారు రూ.2.5లక్షల విలువైన సామాగ్రి, దొంగతనాలకు వాడిన ప్యాషన్ ప్రో మోటార్ సైకిల్ కట్టింగ్ ప్లేయర్, సొనస్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో నిందితుడికి రూరల్ పోలీసు స్టేషన్ లో 5 కేసులు, ఇతర స్టేషన్లలో 11 కేసులు, రూరల్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ తెరిచామన్నారు. అనేక సెక్షన్ల కేసులు నమోదు చేశామన్నారు. నిందితుడు నవీన్ ను స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలిచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ -1 పి.లోకేష్, ఎస్ఐ -2 చల్లా వెంకటేశ్వర్లు ఎఎస్ఐ రాములు నాయక్, కానిస్టేబుల్స్ సైదానాయక్, శంకర్, నాగరాజు, హెూంగార్డు అనిల్ ఉన్నారు.



## ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ జనవరి 13 వార్త మిర్రర్ : ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపక్షం దినపత్రిక పని చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న ప్రజాపక్షం అతి తక్కువ సమయంలోనే అత్యంత ప్రజాధరణ పొంది ప్రజల మన్ననలు పొందుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకొని ప్రజల చైతన్యం కోసం ప్రజాపక్షం పత్రిక ప్రచురితం అవుతుందని ప్రజలు మరింతగా ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు తూం బుచ్చిరెడ్డి,యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,బాబురాం నాయక్,ప్రజాపక్షం నియోజకవర్గ ఇంచార్జ్ దర్శనం విష్ణు, చందంపేట రిపోర్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.




# దేవరకొండలో మన ఇంటి భోజనం హెూటల్ ప్రారంభం

## హెూటల్‌ను ప్రారంభించిన పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్ చెన్నయ్య



దేవరకొండ జనవరి 13 వార్త మిర్రర్ : దేవరకొండ పట్టణంలోని మీనాక్షి చౌరస్తా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ముందు మేడి ప్లస్ మెడికల్ ఆపోజిట్ మన ఇంటి భోజనం హెూటల్ ను సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఏసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, కౌన్సిలర్ చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బహుజన మేధావి డాక్టర్ ఏకుల రాజారావు, చేతుల మీదుగా మన ఇంటి భోజనం బోటి రైస్ హెూటల్ ను ప్రారంభించారు వారు మాట్లాడుతూ యువత స్వశక్తితో ఎదగాలని వారు అన్నారు హెూటల్ యజమాని బోయిని మల్లేష్ మౌర్యను అభినందించారు హెూటల్ యజమాని బోయినీ మల్లేష్ మౌర్య మాట్లాడుతూ( 99) రూపాయలతో బోటి రైస్, చాప రైస్ ,చికెన్ రైస్ , దాల్ రైస్, చట్నీస్, సాంబార్, పెరుగు మొదలగు , ఆరోగ్యకరమైన, రుచికరమైన వంటలతో ఫుల్ (కడుపునిండా) భోజనం అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్, బిజెపి పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్, చిత్రం ప్రదీప్, మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి, నడుంపల్లి శీను ,బత్తుల దినాకర్, రత్నం , లింగయ్య, బయ్య శీను, పల్స దశరథ గౌడ్, నగేష్, బందెల ఆంజనేయులు, దర్శనం విష్ణు, మనోహర్ కాలే వెంకటయ్య, చేపూరి మురళి, హేమంత్, సల్మాన్, రామకృష్ణ, వేణు, కుమార్, ముఖేష్ ,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 13 .. సింగపూర్ టౌన్షిప్ లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో మొదటి వార్షిక దినోత్సవం ఘనంగా జరిగింది. 'క్రిసాలిస్ చార్మ్' పేరుతో జరిగిన ఈ వేడుక అంగరంగవైభవంగా జరిగింది.లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్ గణేష్, ప్రఖ్యాత కరీర్ కౌన్సెలర్ సుధీర్ సాంద్రా, నేపథ్య గాయని శ్రీమతి సమీరా భరద్వాజ్, పాఠశాల విజన్కు దృఢమైన మద్దతుదారుడైన శ్రీ ప్రతీక్, ఏస్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ సేల్స్ ఆఫీసర్ శ్రీ సూర్య చంద్రకాంత్ అతిథులుగా పాల్గొన్నారు. డీపీఎస్, పీజీఓఎస్ గ్రూప్ చైర్మన్ శ్రీ మల్క కొమరియ్య సీఈఓ మల్క యశస్వి, వైస్ చైర్మన్ రాజా మౌగలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. టి. సుధా, జనరల్ సెక్రటరీ సుశీల్ కుమార్ ఈ వేడుకకు హాజరయ్యారు.రామ స్తుతి ప్రార్ధనతో ఉత్సవ దీపాన్ని వెలిగించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. నర్సరీ నుంచి 6వ తరగతి విద్యార్థులు జట్టుకృషి, స్వీయ-వ్యక్తీకరణ, పర్యావరణ అవగాహనను నొక్కిచెప్పే ఆకర్షణీయమైన ప్రదర్శనల ద్వారా తమ ప్రతిభను కనబరిచారు.సాయంత్రం తండ్రీ-కూతురు, తల్లి-కొడుకుల ప్రదర్శనలలో తల్లిదండ్రులు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ. ఈ క్షణాలు కుటుంబాలు, పాఠశాల మధ్య బలమైన బంధాన్ని సూచిస్తాయి. పిల్లల విద్యా ప్రయాణంలో సహకారం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు విద్యార్థులు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ కలిసి క్రిసాలిస్ చార్మ్ బ్యానర్ను ఎగురవేసేందుకు వేదికపైకి వచ్చారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు, మద్దతుదారులకు ప్రిన్సిపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గొంగళి పురుగు దాని రూపాంతరం చెందే సమయంలో చూసుకున్నట్లే, వారి పెరుగుదలను పెంపొందించే స్థిరమైన, మార్గదర్శక శక్తిగా ఉండటం ద్వారా తల్లిదండ్రులు వారి పిల్లల పరివర్తనకు మద్దతు ఇవ్వగలరు. ఉత్సుకత, అన్వేషణ, స్థితిస్థాపకతను పెంపొందించే వాతావరణాన్ని సృష్టించడం ద్వారా, తల్లిదండ్రులు తమ బిడ్డను అందమైన సీతాకోకచిలుకగా విప్పుతున్న క్రిసాలిస్ వలె అభివృద్ధి చెందడానికి అనుమతిస్తారు.ఈ సందర్భంగా ఫౌండర్ ప్రిన్సిపాల్ గగన్దీప్ ధిల్లాన్ మాట్లాడుతూ, "మా మొదటి వార్షిక దినోత్సవం 'క్రిసాలిస్ చార్మ్' ప్రతి పిల్లల ఎదుగుదలకు, సామర్థ్యానికి నిదర్శనం. ఉజ్వల భవిష్యత్తును రూపొందించడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు కలిసి పని చేయాల్సిన బాధ్యతను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం" అన్నారు.

## రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడిగా వాసుదేవ్ కన్నా



శంకర్పల్లి, జనవరి :13 :(వార్త మిర్రర్) : రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యుడిగా శంకర్పల్లి మున్సిపాల్టీకి చెందిన వాసుదేవ్ కన్నా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాసుదేవ్ కన్నా మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు పని చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనని జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ నాయకులకు వాసుదేవ్ కన్నా కృతజ్ఞతలు తెలిపారు.





## సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

### ::: బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే సతీమణి

మిర్యాలగూడ జనవరి 13:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద ముగ్గుల పోటిలు నిర్వహించారు . పోటీలో గ్రామ మహిళలు, యువతులు ముగ్గులను వేశారు. మహిళలు వేసిన ముగ్గుల ప్రదర్శనకు ముఖ్య అతిథి బత్తుల మాధవి మహిళలు వేసిన ముగ్గులను తిలకించారు. పోటీల్లో పాల్గొన్న వారికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి బత్తుల మాధవి బహుమతులు అందజేశారు. మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు గాయం రజిత ఉపేందర్రెడ్డి, అప్పనబోయిన వెంకటమ్మ వెంకటయ్య, మాజి సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరెడ్డి, పార్టీసీనియర్ నాయకులు నక్క ఆశాలు, అప్పనబోయిన వెంకటయ్య, కారంపుడి రవి, కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ధనుర్మాస వేడుకల్లో శ్రీ గోదారంగనాధుల కళ్యాణ వేడుకలు

మిర్యాలగూడ జనవరి 13,:-(వార్తమిర్రర్) : ధనుర్మాస వేడుకల్లో రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమం అష్టలక్ష్మి మందిరంలో సోమవారం కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు . గోదా రంగనాథుల విగ్రహాలను పూలతో అలంకరించి ఊరేగింపు చేపట్టారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి తిరుప్పావై పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రతాప్ ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య జానకి రాముడు శ్రీనివాసబాబు, విక్రమ్, పద్మ, సీత భవాని కళ్యాణి సుకన్య పాల్గొనగా రేగట్ట విక్రం సుకన్య దంపతులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



## శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన, తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శ్రీ గోదా కల్యాణోత్సవంలో సందర్భంగా స్వామివారికి,ఎటు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పరిసరాలను వీక్షించిన, స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆలయ ప్రధాన పూజారులు గడ్డం ప్రసాద్ కుమార్ కు ఘనంగా సన్మానించి, ప్రత్యేక పూజలు చేయించి,స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు

## లిరంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబెర్గా కొండకల్ గ్రామానికి చెందిన కొలన్ శ్రీనివాస్ రెడ్డి

### నా పై నమ్మకం ఉంచి నన్ను ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు



శంకర్పల్లి , జనవరి: 13: (వార్త మిర్రర్) : రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబెర్ గా కొండకల్ గ్రామానికి చెందిన కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు పని చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనని జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా, మండల, మున్సిపల్ నాయకులకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కుమారుడు వైభవ్ గౌడ్ ప్రత్యేక పూజలు

శంకర్పల్లి , జనవరి: 13: (వార్త మిర్రర్) : శంకర్పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దపు శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ కుమారుడు వైభవ్ గౌడ్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వైభవ్ గౌడ్ ను స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా వైభవ్ గౌడ్ మాట్లాడుతూ వెయ్యి ఏళ్ల కిందటి మహిమ గల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో మోకిల ఎస్సై కోటేశ్వరరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు సదానందం గౌడ్, చైర్మన్ గోపాల్ రెడ్డి ఉన్నారు.

## పదేళ్ల పాలనలో భువనగిరిలో అభివృద్ధి సంక్షేమ పథకాల కోసమే కృషి చేశాం

### ఇచ్చిన హామీలు మరువలేదు.. అరాచకాలు చేయలేదు: డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో భువనగిరిలో ఒక్క దాడులు, అరాచకాలు జరగలేదు, పైళ్ళ శేఖర్ రెడ్డి నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పైనే మా దృష్టి సారించాం.! ప్రతిపక్షంలో ఉన్న నాయకులకు కూడా కెసిఆర్ సంక్షేమ పథకాలను అందించాం, రైతుబంధు కాని, రైతు భీమా కానీ, కెసిఆర్ కిట్టు కానీ, న్యూట్రిషన్ కి గాని, బీసీ కుల వృత్తుల వారికి లక్ష రూపాయల సహాయం, కళ్యాణ లక్ష్మి, చాపల పెంపకం, గొర్ల పెంపకం, ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా, మా సంక్షేమ పథకా లను అందించడమే మా ఉద్దేశం, కెసిఆర్ లక్ష్యం, మీరు అబద్దాల 6 గ్యారెంటీలు అని చెప్పి ఇందిరమ్మ రాజ్యం వస్తదని, రౌడీ రాజ్యం చేయడం సబబు కాదని అన్నారు, డాక్టర్ ర్యాకల ప్రతిపక్షాలను గౌరవించాలి వారి డిమాండ్లను పరిష్కరించాలి, కానీ వారిపై దాడి చేయడం సబబు కాదని అన్నారు, మార్పు , ప్రజామార్పు అని వచ్చిన మీరు ముందుగా మీరు మారవాలని అన్నారు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



## కాంగ్రేస్ నాయకులు ఎంబారీ వెంకటేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 13 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ లో కాంగ్రేస్ నాయకులు ఎంబారి వెంకటేష్ ఆధ్వర్యంలో గడికోట పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో సుమారు 45 మంది ఆడపడుచులు పాల్గొని ఆకర్షణీయంగా రంగు రంగుల రంగవల్లులు వేశారు. న్యాయ నిర్ణేతల ఆధ్వర్యంలో ప్రథమ బహుమతి కొల్లూరి ప్రణీత, ద్వితీయ బహుమతి అత్తినేని మాధురి, తృతీయ బహుమతి సోమ భార్గవి బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం రంగవల్లి కార్యక్రమం లో గెలిచినవారికి మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్బంగా ఎంబారి వెంకటేష్ మాట్లాడుతూ నా ఆహ్వానాన్ని మన్నించి ముగ్గుల పోటీలో పాల్గొన్న సోదరి మణులందరికి, మరియు పార్టీలకు అతీతంగా నా ఆహ్వానన్ని మన్నించి పాల్గొన్న వివిధ పార్టీల నాయకులకు, గ్రామ పెద్దలకు, యువకులకు, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన జడ్జిలకు, కార్యక్రమానికి సహకరించిన వారందరికీ పేరు పేరున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, వెంకటేశ్వర రావు (అడ్వకేట్) చిట్యాల భూమయ్య , రాజ్ మహమ్మద్, ఉరుమడ్ల వాసు, ఎలుముల భూమయ్య, నామని లక్ష్మి నరసయ్య,కొల్లూరి మహేష్, బొమ్మ కంటి సురేష్ , రాజు, గణేష్, అనుమల్ల మహేష్, రాజ్ కుమార్, వేముల సతీష్ , పోతు శీను, మిట్టపల్లి రాజేందర్, ముజాజ్, అత్తినేని శంకర్ తదితరులు పాల్గొని కార్యక్రమాలని విజయవంతం చేశారు..

## కొంపల్లి మున్సిపాలిటీ నూతన బిజెపి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెద్దబుద్దుల సతీష్ సగర

### ఆర్థిక శుభాకాంక్షలు తెలిపిన సగర యువజన సంఘం నాయకులు



కొంపల్లి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : కొంపల్లి మున్సిపాలిటీ నూతన భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన, తెలంగాణ సగర సంఘం ఉపాధ్యక్షులు, యువజన సంఘం పూర్వ అధ్యక్షులు, సామాజికవేత్త, పెద్ద బుద్దుల సతీష్ సగర గారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు, తెలంగాణ యువజన సంఘం అధ్యక్షులు మార్క సతీష్ సాగర, ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ సాగర్, కోశాధికారి సాయి గణేష్ సాగర్, పెద్ద బుద్దుల సతీష్ సాగర్ కు ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు, వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని నమ్ముకుని, పార్టీ బలోపేతంకై అనుక్షణం కృషి చేస్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను మన సగరులకు అందిస్తూ ఇటు పార్టీకి మన సగరులకు సేవ చేస్తున్న సతీష్ సగరకు, భారతీయ జనతా పార్టీలో ఉన్నత స్థాయిలో పదవులు చేపట్టాలని, ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు తెలంగాణ సగర యువజన సంఘం నాయకులు

## తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

### తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్



నాగోల్ వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : ప్రకృతిపై ఆధారపడిన మనం (కులవృత్తులు), ప్రకృతి పైనే ఆధారపడి మన జీవన విధానాన్ని కొనసాగిస్తాం. గ్రామీణ ప్రాంతాలలోని కులవృత్తులు సంస్కృతిక, ఎా ం ద ం ల ం గా కొనసాగుతున్నాం. ప్రకృతిలో జరిగే అనేక మార్పులలో సంక్రాంతి ఒక గొప్ప మార్పు సం-క్రాంతి- ఒక కొత్త క్రాంతి భూమి సూర్యుడికి దగ్గర ఉష్ణం పెరగడం, క్రాంతి పెరగడం, పగలు పెరగడం,భూమి దక్షిణాయానం నుండి ఉత్తరాయణం వైపు ప్రయాణం చేయడం ఇది ప్రకృతిలో మార్పు.సంక్రాంతి సందర్భంగా మనలో మన జీవితాలలో వెలుతురు రావాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవనం సాగించాలని కోరుకుంటూ మరొకసారి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు బద్దం ధనుంజయ్ గౌడ్

# పాడి కౌశిక్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే సంజయ్ పై కౌశిక్ వాఖ్యలు సరికాదు

### కాంగ్రెస్ శ్రేణుల ప్రెస్ మీట్ .. పోలీస్ స్టేషన్ లో పిర్యాదు






వార్త మిర్రర్ రాయికల్ (శంకర్ తిరుమల) జనవరి 13 : రాయికల్ పట్టణంలోని స్థానిక జెఎసి ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి రవిందర్ రావు మాట్లాడుతు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై పాడి కౌశిక్ రెడ్డి అనుచితంగా వ్యవహరించడం పరుష పదజాలంతో మాట్లాడాన్ని త్రీవంగా ఖండించారు. పార్టీ మారిన నాయకుల పై గుండాయిజమ్ ప్రదర్శిస్తున్న తీరు పట్ల ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని, సంజయ్ కుమార్ ఎదుగుదలను ఓర్వలేక పోతున్నారని అన్నారు. అనంతరం మున్సిపల్ చెర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతు ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే సంజయ్ పై దాడి చెయ్యడం పట్ల చట్ట పరంగా చర్యలుతీకోవాలని ప్రజాస్వామ్య వాదులందరు ఈ సంఘటనను ఖండించాలని అన్నారు. కోల శ్రీనివాస్ మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పై దాడి చెయ్యడ%శీ% వ్యతిరేకిస్తున్నామని, ప్రతి సారి తన ఉనికి కోసం కౌశిక్ ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే రాజారెడ్డి, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రవిందర్ రెడ్డి, తిరుపతి గౌడ్, శ్రీనివాస్, సమల్ల శ్రీనివాస్, బెజ్జంకి మోహన్, పల్లికొండ గంగాధర్, సిరిపురం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి మంద జగన్నాథం సేవలు మరువలేనివి

### ::: మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్

కల్వకుర్తి కడ్తాల్ జనవరి 13 వార్త మిర్రర్ ప్రతినిధి:- తెలంగాణ రాష్ట్ర సాధనలో మంద జగన్నాథం సేవలు మరువలేనివని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కడ్తాల్ మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం గొప్ప నాయకున్ని కోల్పోయిందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ లోని నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుండి ఎన్నికై ఢిల్లీలో చక్రం తిప్పిన ఏకైక దళిత నాయకుడు ఆయన తెలంగాణ రాష్ట్రం నుండి ఢిల్లీకి అధికార ప్రతినిధిగా ఎదిగిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరా బాద్ నిమ్స్ హాస్పిటల్ లో ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.దీంతో హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆయన పార్థివ దేహానికి పూలమాలసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు లచ్చి రామ్ నాయక్ బొప్పిడి గోపాల్ డైరెక్టర్లు జోగు వీరయ్య సేవ్య నాయక్ మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్ నాయకులు జంగయ్య మంగళపల్లి నరసింహా పాండు నాయక్ శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

### ::: బిసి నేత లింగంగౌడ్



మిర్యాలగూడ జనవరి 13:- (వార్తమిర్రర్) : కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు బీసీ డిక్లరేషన్ పేరుతో కామారెడ్డిలో పెద్ద ఎత్తున బీసీల సభ నిర్వహించి బీసీలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని చెప్పి వాగ్దానాలు ఇచ్చిందని వెంటనే సంక్రాంతి కానుకగా బీసీ ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి అందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కులాల అభివృద్ధి కోసం సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి బీసీ కుటుంబానికి ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని అంతేకాకుండా ప్రభుత్వం సివిల్ కన్స్ట్రక్షన్స్ మెయింటెనెన్స్, కాంట్రాక్టర్లు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాజుల పేర్కొనారు.



## ప్రాచీన శివాలయంలో దీపారాధనకు 12 కేజీల నువ్వుల నూనె అందజేసిన-నేర్లకంటి పరమేష్ సాగర్

### నిత్య దీపారాధనకు దాతలు సహకరించాలి- పాలకుర్ల సతీష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రాచీన ఉమామహేశ్వర శివాలయానికి దీపారాధనకు 12 కేజీల నువ్వుల నూనెను శివాలయం కమిటీ అధ్యక్షులు పాలకుర్ల సతీష్ గౌడ్ అందించారు, శివ భక్తుడు నేర్లకంటి పరమేశ్ సాగర్, ప్రాచీన శివాలయం అధ్యక్షులు సతీష్ గౌడ్ మాట్లాడుతూ ఆలయంలో నిత్య దీపారాధనకు, ఆలయ అభివృద్ధికి దాతలు వస్తు రూపేనా, ధన రూపేనా సహకరించాలని తెలిపారు

## సులభతర వ్యాపారానికి పది చర్యలు



వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు పది పాయింట్ల అజెండాను భారతీయ పరిశ్రమల సమాఖ్య కేంద్ర ప్రభుత్వానికి సూచి ంచింది. నిబంధనల అమలు భారాన్ని తగ్గించడం, నియంత్రణ పరమైన కార్యాచరణను సులభంగా మార్చడం, పారదర్శకతను పెంచడం లక్ష్యాలుగా బడ్జెట్‌కు ముందు సీఐఐ ఈ సూచనలు చేయడం గమనార్హం. కేంద్రం, రాష్ట్రం, స్థానిక స్థాయిలో అన్ని నియంత్రణపరమైన అనుమతులను జాతీయ సింగిల్ విండో విధానంలోనే మంజూరు చేయాలి. కోర్టుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి. ప్రత్యా మ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని తీసుకురావాలి. పర్యావరణ నిబంధనల అమలును క్రమబద్ధీకరించేందుకు వీలుగా ఏకీకృత కార్యా చరణను ప్రవేశపెట్టాలి. అన్నింటితో ఒకే డాక్యుమెంట్‌ను తీసుకురావాలి. వ్యాపార విస్తరణ, కొత్త వ్యాపారాలకు భూమి ఎంతో అవసరం. ఆన్‌లైన్ ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ అథారిటీని అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలను ప్రోత్సహించాలి. భూమి రికార్డులను డిజిటైజ్ చేయడం, వివాదాల్లో ఉన్న భూముల సమాచారం అందించడం లక్ష్యాలుగా ఉండాలి. భూసమీకరణలో పరిశ్రమకు సహకరించేందుకు వీలుగా.. చాలా రాష్ట్రాల్లో భూముల సమాచారాన్ని అందించే 'ఇండియా ఇండ్రస్టియల్ ల్యాండ్ బ్యాంక్‌ను కేంద్రం నిధుల సహకారంతో జాతీయ స్థాయి ల్యాండ్ బ్యాంక్‌గా అభివృద్ధి చేయొచ్చు. పరిశ్రమల దరఖాస్తుల మదింపును నిర్ణీత కాల వ్యవధిలో ముగించేందుకు, కేంద్ర ప్రభుత్వ శాఖల సేవలకు చట్టబద్ధమైన కాల పరిమితి నిర్ణయించాలి. కార్మిక చట్ట నిబంధనలు ఇప్పటికీ కష్టంగానే ఉన్నాయి. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు చేయాలి. అన్ని రకాల కేంద్ర, రాష్ట్ర కార్మిక చట్ట నిబంధనల అమలుకు కేంద్రీకృత పోర్టల్‌గా శ్రమ్ సువిధ పోర్టల్‌ను అమలు చేయాలి. అథరైజ్డ్ ఎకనమిక్ ఆపరేటర్ కార్యక్రమాన్ని తీసుకురావాలి. ఎన్నో ప్రాధాన్య అనుమతులకు మార్గం సుగమం అవుతుంది.




## గురు స్వామి దేశిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలహాధారణ స్వాములకు రైలులో వెయ్యి మందికి అల్పాహారం, మహా అన్నదానం

మిర్యాలగూడ జనవరి 13:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని పులిమేడు ఆశ్రమం ప్రధాన గురుస్వామి దేశిడి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శబరిమల అయ్యప్ప స్వామి దర్శన యాత్ర కార్యక్రమంలో శబరి ఎక్స్ప్రెస్ లో అయ్యప్ప మాలహాధారణ స్వాములకు రైలు ప్రయాణికులకు అందరికీ సుమారు 1000 ఒక వెయ్యి మందికి రైలులో అల్పాహారం, మహా అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ డి.శేఖర్రెడ్డి గురుస్వామి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా శబరి యాత్ర చేస్తున్నామని గత పది సంవత్సరాలుగా సంఘసంస్కర్త, ప్రజాసేవకుడు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని ఆదర్శంగా తీసుకుని పులిమేడు ఆశ్రమ స్వాములు బస్సులో శబరి యాత్రకు వెళ్ళినప్పుడు వివిధ పుణ్యక్షేత్రాలలో అన్నదాన, వస్త్ర దాన కార్యక్రమాలను నిర్వహించే వాళ్ళమని అదేవిధంగా రైలులో ప్రయాణం చేసినప్పుడు రైలులోని ప్రయాణికుల అందరికీ అల్పాహారం, అన్నప్రసాదాన్ని అందించారు అదేవిధంగా ఈ సంవత్సరం బిఎల్ఆర్ బ్రదర్స్ సహకారంతో రైలులో దాదాపుగా వెయ్యి మందికి అల్పాహారం అన్న ప్రసాదం పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పులిమేడు ఆశ్రమ స్వాములందరూ ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆదర్శంగా తీసుకుని ఒక మాలవేసిన సమయంలోనే కాక ఎప్పుడూ వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు కార్యక్రమంలో 25 వ వార్డు ఇంచార్జ్ గోదాల జానకి రాంరెడ్డి 27వ వార్డు ఇంచార్జ్ గొట్టిముక్కల లక్ష్మణ్ గురు స్వామి, దేశిడి కిషోర్రెడ్డి, రంగారావు, డప్పు శ్రీనివాస్ కుప్పాల శ్రీనివాస్, తాళ్ల వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, మందడి రవీందర్రెడ్డి రామారావు బుల్లెట్ రాజా శ్యాంసుందర్రెడ్డి, ఓరుగంటి శివ, యాదిరెడ్డి, రమేష్ గౌడ్, కొండల్ నరేందర్ పాల్గొన్నారు



## క్రీడలకు మద్దతుగా ఉండే నాయకులు స్ఫూర్తిదాయకులు నీళ్ల లింగస్వామి గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఎస్ ఎన్ పి ఎల్-4 క్రికెట్ టోర్నమెంట్ లో క్వాటర్ ఫైనల్ లో (జెడ్ పి హెచ్ ఎస్) నారాయణపూర్ టీం క్రీడాకారుడు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన, అరవింద్ రెడ్డి కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందించిన, వివేకానంద యువ కేంద్ర సభ్యులు నీళ్ల శ్రీధర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు లింగస్వామి గౌడ్ మాట్లాడుతూ క్రీడలకు మద్దతుగా ఉండే నాయకులు స్ఫూర్తిదాయకులని ఈ టోర్నమెంట్స్ యువతకు క్రీడా స్ఫూర్తి అందించడంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని క్రీడలు జరగాలని, అన్నారు, ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వంగరి రఘుపతి, ఎస్ ఎన్ పి ఎల్ సీజన్ 4 టోర్నమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల నాగరాజు, వివేకానంద యువ కేంద్ర ఉపాధ్యక్షులు సురపల్లి వెంకటేష్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, చిలువేరు సైదులు, సురపల్లి జవహర్, తదితరులు పాల్గొన్నారు



## చైన్నైకి క్రికెట్‌లో సెలక్షన్ గా నియమితులైన యువకునికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థిక సహాయం

### క్రీడల ద్వారా యువత భవిష్యత్తు నిర్మాణం- రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని వెంకం భాయ్ తండా కు చెందిన కొర్ర సాయిరాం క్రికెట్ సౌత్ జోన్ చైన్నై కి నిమితులైన సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ యువకుడిని సన్మానించి, 5000/వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి యువకులు క్రీడల పై దృష్టి సారించి వెలుగులోకి రావాలని కోరారు, ఎంతోమంది క్రీడాకారులు వారి ప్రతిభను బయటికి తీసుకురావాలని అన్నారు, క్రీడల ద్వారా యువత భవిష్యత్తు నిర్మాణం అవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో వివేకానంద యువకేంద్రం అధ్యక్షులు రాపర్తి వెంకటేష్ గౌడ్,నీళ్ల లింగస్వామి, సురపల్లి వెంకటేష్,నీల్ల శ్రీధర్, దోర్నాల శ్రీను, రాసాల యాదయ్య, పాలకుర్ల యాదయ్య, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు లారీ బిక్షం, కార్యదర్శి ఎడ్ల సత్తయ్య, రాసాల వెంకటేష్,పాశం రాములు,తండా వెంకటేష్,విరమల్ల వెంకటేష్, ఉప్పల శ్రీను, బుగ్గ రాములు, దూసరి శ్రీను, పేరా రమేష్, చిలివేరు శంకర్, నీళ్ల నాగరాజు,రాపర్తి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా గోదాదేవి రంగానాథుల కళ్యాణం

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 13 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని కిష్టంపేట గ్రామం లోని శివ భక్త మార్కండేయ శ్రీ వెంకటేశ్వర జ్ఞాన సరస్వతి దేవాలయంలో గోదాదేవి రంగనాథుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతం వేద పండితులు గోదాదేవి రంగనాదులకు కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పద్మశాలి సంఘ సభ్యులు, కిష్టంపేట గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అల్లీపూర్‌లో..**

రాయికల్ మండలం అల్లీపూర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీ గోదా రంగనాయక స్వామి కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమం లో బాలె అరుణ, ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్, బాలె శోభ రాణి, మాజీ ఎంపీటీసీ, బాలె చంద్ర శేఖర్, పురోహితులు అంగడి భువనేశ్వర్, సుధీర్, అజయ్, గోపి కృష్ణ, కిరణ్, మాజీ ఎంపీటీసీ మోర విజయ లక్ష్మి- వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

